క్లుప్తంగా

ఓటు హక్కును వినియోగించుకోండి


రన్‌లో అధికారులు, స్థానికులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో శనివారం తెల్లాపూర్ నైబర్‌హూడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పలు కాలనీవాసులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని పలువురు కోరారు. ఎన్నికల రోజున ఓటు వేసి ఓటింగ్ శాతాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి జ్యోతిరెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, కొల్లూర్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, తెల్లాపూర్ నైబర్‌హూడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర గారి రమణ తదితరలు పాల్గొన్నారు.

భగవన్నామస్మరణతోనే శాంతి


తీర్థ ప్రసాదం పంపిణీ చేస్తున్న గురుమూర్తి వెంకటస్వామి

మునిపల్లి(అందోల్): నిత్యం భగవన్నామస్మరణ చేస్తేనే శాంతి దొరుకుతుందని రుస్తుంపేట ఆత్మానందాశ్రమ పీఠాధిపతి శ్రీ భగవద్భక్త రాజయోగి వెంకటస్వామి అన్నారు. శనివారం మండలంలోని మక్తక్యాసారం ఆత్మానందాశ్రమంలో భక్తులకు ఉపదేశించారు. అంతకుముందు గురుమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ తల్లిదండ్రులు, పెద్దలను గౌరవించాలన్నారు. భక్తితోనే ముక్తి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

52వ సారి రక్తదానం


రక్తదానం చేస్తున్న చంద్రశేఖర్

నారాయణఖేడ్: సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ రోగికి అత్యవసరంగా రక్తం ఎక్కించాల్సిన ఆవశ్యకత శనివారం ఏర్పడింది. నారాయణఖేడ్ మండలం ర్యాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చంద్రశేఖర్ సమాచారం అందుకుని ఉదయం ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశారు. ఆయన రక్తదానం చేయడం ఇది 52వ పర్యాయం కావడం విశేషం. కరోనా సమయంలో పలువురు రోగులకు ప్లాస్మాను దానం చేశారు. మోహన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవయవదానం చేస్తూ అంగీకారపత్రాన్ని సైతం ఇదివరకు అందజేశారు.

ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

మునిపల్లి(అందోల్): ఓటరు జాబితాలో పేర్లున్నవారికి సమాచార స్లిప్పులు పంపిణీ చేయాలని బూత్ లెవల్ ఆఫీసర్లను తహసీల్దార్ తెన్‌మోళి ఆదేశించారు. శనివారం మండల కేంద్రమైన మునిపల్లి రైతు వేదికలో బూత్ లెవల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఓటరు సమాచార స్లిప్పులను పంపిణీ చేయాలని సూచించారు.

ఆర్టీసీకి ఆదాయం పెంచాలి


అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌ఎం దైవాదీనం

నారాయణఖేడ్: ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కొనసాగుతున్నందున ఖేడ్ ఆర్టీసీ డిపోనకు రోజుకు రూ.లక్ష ఆదాయం పెరిగేలా అధికారులు చూడాలని ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎం దైవాదీనం సూచించారు. నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం డీఎం మల్లేశయ్య, సీఐ నర్సింహులుతో డిపో పరిస్థితులు, ఓఆర్, ఆదాయం, వ్యయాలు తదితర అంశాలను సమీక్షించారు.

భవనం పూర్తయ్యేదెప్పుడో?

- నిధులు ఉన్నా.. పనులు సున్నా
- పదేళ్లుగా నిలిచిపోయిన మారేపల్లి పంచాయతీ భవనం
- సమావేశాలకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు


నిర్మాణంలో ఉన్న నూతన పంచాయతీ కార్యాలయం

కొండాపూర్(సంగారెడ్డి): ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యాలయం నిర్మించాలనే ఉద్దేశ్యంతో 2014లో అప్పటి ప్రభుత్వం ఒక్కో పంచాయతీకి ఈజీఎస్ నిధుల కింద రూ.13 లక్షలు మంజూరు చేసింది. అందులో భాగంగానే మండల పరిధిలోని మారేపల్లి గ్రామంలో పంచాయతీ సమావేశాలకు ఇబ్బందిగా ఉండడంతో ప్రభుత్వం నూతనంగా పంచాయతీ భవనాన్ని మంజూరు చేసింది. నిధులు మంజూరు చేయడంతో పనులు సైతం ప్రారంభించారు. కాంట్రాక్టర్‌ల నిర్లక్ష్యమే, అధికారుల అలసత్వం కారణమో తెలీయదు గానీ పదేళ్లుగా పనులు నిలిచిపోవడంతో భవన నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. దీంతో సమావేశాలను నిర్వహించుకోలేని పరిస్థితి.

మేజర్ గ్రామ పంచాయతీల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రాగా, గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. మారేపల్లి గ్రామం పంచాయతీ కార్యాలయానికి నోచుకోలేదు. డిజిటల్ ఇండియా అంటూ గొప్పలు చెప్పుకోవడం తప్ప గ్రామీణ ప్రాంతాల్లో అభివద్ధి జాడ ఏమాత్రం కనిపించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో గల గ్రామ పంచాయతీలకు సొంత గూడు లేదు. గతంలో పంచాయతీ కార్యాలయాలు నిర్మించినా అవి ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరడమే కాకుండా, గదులు చిన్నవిగా ఉన్నాయి. దీంతో పాలక వర్గం సమావేశాలు, గ్రామ సభలు నిర్వహించకోవడం ఇబ్బందిగా మారింది. చాలా చోట్ల ఆరు బయట సమావేశాలు లేకపోతే కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్నారు. వర్షాకాలం వస్తే పడరాని పాట్లు పడాల్సి వస్తోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

త్వరగా పూర్తి చేయాలి



మారేపల్లిలో పంచాయతీ భవనం లేకపోవడంతో గ్రామ సభలు నిర్వహించేందుకు ఇబ్బంది పడుతున్నాం. గ్రామంలోని కమ్యూనిటీ హాల్లోనే నిర్వహించాల్సి వస్తుంది. అందులోనూ సరైన సౌకర్యాలు లేవు. పంచాయతీ భవనానికి నిధులు మంజూరైనా పంచాయతీ నిర్మాణ పనులు ప్రారంభమై సుమారు పదేళ్లుగా నిలిచిపోయాయి. అధికారులు స్పందించి పంచాయతీ భవనం నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

– జయవర్ధన్, గ్రామస్తుడు

బీజేపీ, కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి


నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: బీజేపీ, కాంగ్రెస్‌లు ఇచ్చిన హామీలను విస్మరించినందున ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో ఆయా పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కోరారు. శనివారం మండలంలోని అల్లాపూర్, హంగిర్గా(కె), హంగిర్గా(బి)లతో పాటు పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ పదేళ్లయినా అనేక హామీలు నెరవేర్చలేదన్నారు. అల్లాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు ఉమాకాంత్ తన అనుచరులతో భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఖేడ్ మున్సిపాలిటీలోని 2వ వార్డులో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రచారాల్లో జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్ నాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ రుబీనా నజీబ్, కౌన్సిలర్ స్వప్న అభిషేక్ షెట్కార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు నగష్ ఉన్నారు.

ప్రణాళికతో చదవాలి
ఏటీఓ శ్రీనివాస్‌రెడ్డి


డిగ్రీలో టాపర్‌గా నిలిచిన దర్శని సన్మానిస్తున్న ఏటీఓ శ్రీనివాస్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: విద్యార్థులు ప్రణాళికతో చదివాలని జహీరాబాద్ అసిస్టెంట్ ట్రెజరీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాల విద్యార్థిని కేకేవీ దర్శని డిగ్రీ ఫలితాల్లో ఐదు సెమిస్టర్‌లకు గాను 10 జీపీఏ సాధించి ఉస్మానియా యూనివర్శిటీలో ప్రథమ స్థానంలో నిలిచింది. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏటీఓ ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీ ప్రపంచలో ఉన్నత స్థానంలో నిలబబడానికి సిలబస్‌కు అనుగుణంగా చదవాలన్నారు. ప్రణాళిక ప్రకారం చదివితే గొప్ప ఉద్యోగాలు వస్తాయన్నారు. కళాశాల విద్యార్థులు టాపర్‌లు నిలబడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల హరికుమార్, డైరెక్టర్ వెంకటరాంరెడ్డి, అధ్యాపకులు నందుగౌడ్, రాంప్రసాద్, దత్తు, నర్సింలు, నిఖిత, నవీన,దీపిక, లావణ్య, ఇస్రాద్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఓపెన్ పరీక్షలు


సంగారెడ్డిలోని బాలుర ఉన్నత పాఠశాలను సందర్శిస్తున్న రాష్ట్ర స్థాయి స్క్వాడ్ బృందం

కొండాపూర్(సంగారెడ్డి): ఓపెన్ స్కూల్ విధానంలో జరుగుతున్న పదవ, ఇంటర్మీడియెట్ పరీక్షలు మూడో రోజు ప్రశాంతంగా జరిగాయి. పరీక్షలలో భాగంగా శనివారం పదోతరగతి అభ్యాసకులకు ఉదయం గణితం, మధ్యాహ్నం బిజినెస్ స్టడీస్ పరీక్షలు జరగగా, ఇంటర్ అభ్యాసకులకు ఉదయం పొలిటికల్ సైన్స్, మధ్యాహ్నం కెమిస్ట్రీ పరీక్షలు జరిగాయి. ఉదయం జరిగిన ఇంటర్మీడియెట్ పరీక్షలకు 2,924 మందికి గానూ 2,649 మంది హాజరు కాగా, పదో తరగతి పరీక్షలకు 2,195 మందికి గానూ 1,958 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ఇంటర్మీడియెట్ పరీక్షకు 813 మందికి గానూ 737 మంది హాజరు కాగా, పదోతరగతి పరీక్షకు 41 మందికి గానూ 33 మంది హాజరయ్యారు. రాష్ట్ర స్థాయి ఫ్లయింగ్ స్క్వాడ్‌తో పాటు డీఈఓ వెంకటేశ్వర్లు సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పటాన్‌చెరువులోని సెయింట్ జోసెఫ్ స్కూల్, బీహెచ్‌ఈఎల్‌లోని విద్యాభారతి హైస్కూల్ పరీక్ష కేంద్రాలను సందర్శించారు. వీరితో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌బృందాలు ఆరు పదోతరగతి, ఆరు ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ఇంటర్ టాపర్‌లకు సన్మానం


టాపర్‌లను సన్మానిస్తున్న ప్రతినిధులు

జహీరాబాద్ టౌన్: ఇంటర్ పరీక్షలో టాపర్‌గా నిలిచిన విద్యార్థులను షాహీన్ విద్యాసంస్థల నిర్వాహకులు శనివారం సన్మానించారు. పట్టణంలోని షాహీన్ కళాశాల ఇంటర్ ఫస్ట్‌ఇయర్ విద్యార్థి షేక్ సమీర్‌కు ఇటీవల వెలుబడిన పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంక్ వచ్చింది. ఇంటర్ బైపీసీ ఫస్ట్ ఇయర్‌లో 440 మార్కులకు గాను 438 మార్కులు వచ్చాయి. మరి కొంత మంది విద్యార్థులు జిల్లా టాపర్‌లుగా నిలిచారు. వీరందరిని షాహీన్ విద్యాసంస్థల ప్రతినిధులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందచేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జమీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని ఓడించాలి


మాట్లాడుతున్న అతిమెల మాణిక్

నారాయణఖేడ్: ప్రజావ్యతిరేక, మతోన్మాద బీజేపీని ఓడించి రాజ్యాంగం, రిజర్వేషన్లను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమెల మాణిక్ అన్నారు. శనివారం ఖేడ్ సీఐటీయూ నిర్వహించిన డివిజన్ స్థాయి సభలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశసంపదను కార్పొరేట్లకు దోచిపెట్టిందని మండిపడ్డారు. ఉద్యోగాలు కల్పించకుండా నిరుద్యోగ భారత్‌గా మార్చిందన్నారు. కార్మికుల చట్టాలను రద్దుచేసి హక్కులను కాలరాసిందన్నారు. దేశ ప్రజలు బీజేపీని ఓడించి ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సతీష్, అరుణ్, ప్రజా సంఘాల నాయకులు కాన్షీరాం, సుధాకర్, మాణిక్యం, రాజు, సురేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆర్‌ఎస్‌ఎస్ శిక్షణ

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదలలో శనివారం ఆర్‌ఎస్‌ఎస్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. నిర్వాహకులు కృష్ణ, వినోద్‌రెడ్డి, శ్రీకాంత్‌లు... ఆయా గ్రామాల నుంచి హాజరైన వారికి శిక్షణను అందించారు. మరో రెండు రోజుల పాటు తరగతులను నిర్వహిస్తామని చెప్పారు.

◆ ఆలయంలో ప్రత్యేక పూజలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని వెంకటాపూర్, కంబాలపల్లి, ఆరూర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాలతో సర్వాంగాభిషేకం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిల్వేరి వెంకటేశం, కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

◆ శాస్త్రవేత్తకు సన్మానం

రాయికోడ్(అందోల్): మండల కేంద్రం రాయికోడ్‌లోని రాధాకృష్ణ మెమోరియల్ పాఠశాల కరస్పాండెంట్ కవనం పాండు తన ఉపాధ్యాయులు, మిత్రబృందంతో కలిసి శాస్త్రవేత్తకు శాలువా, పూల మాలలతో సన్మానించారు. ఝరాసంగం మండలం కంబాలపల్లి గ్రామానికి చెందిన బత్తిని శ్రీశైలం ఇటీవల వ్యవసాయ శాస్త్రవేత్తగా ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో యువ శాస్త్రవేత్తను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, మిత్రులు ప్రిన్సిపాల్ వెంకటేశం, దుర్గరామ్, రజినికాంత్, పాండు, తదితరులు ఉన్నారు.

◆ నాణ్యత పాటించాలి

కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని పర్యటించారు. పాత మార్కెట్ యార్డు వద్ద నిర్మిస్తున్న నూతన సీసీ రోడ్డు పనులను, గోకుల్ నగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న పనులను కార్పొరేటర్ పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కార్పొరేటర్ కాంట్రాక్టర్ కు సూచించారు.

◆ బీజేపీ విజయం ఖాయం

రాయికోడ్(అందోల్) : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీ నియోజక వర్గంలో బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ విజయం ఖాయమని ఆ పార్టీ జిల్లా నాయకుడు శ్రీనివాస్ కులకర్ణి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని రాయిపల్లిలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ పార్టీకి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు జీ.విఠల్ బీజేపీలో చేరగా పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వీరన్న పాటిల్, విఠల్‌రెడ్డి, రాజేశ్ పాటిల్ పాల్గొన్నారు.

◆ 29న దివ్యాంగుల ఉచిత బస్‌పాస్ మేళా

నారాయణఖేడ్: దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్ మేళాను ఈనెల 29న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండల కేంద్రమైన న్యాల్కల్ ఐకేపీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య, పీఆర్వో పాండు తెలిపారు. దివ్యాంగులు ఉచిత బస్‌పాసుల కోసం సదరం ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, దివ్యాంగుల గుర్తింపు కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతోపాటు సర్వీసు ఛార్జి కింద రూ.50 తీసుకొని రావాలని సూచించారు.

◆ ప్రపంచ భద్రతా దినోత్సవం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ పరిశ్రమలో ప్రపంచ భద్రతా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. బీహెచ్‌ఈఎల్ ఈడీ కేబీ రాజా, ఈడీ పీఈ అండ్ ఎస్‌డీ వై.శ్రీనివాస్‌రావు పాల్గొన్ని భద్రత జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ప్రవీణ్ కుమార్, శ్రీవిద్య, భెల్ అధికారులు, కార్మికసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే స్వరాష్ట్రం కల సాకారం


ఆవిర్భావ వేడుకల్లో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: తెలంగాణ ప్రజల పార్టీ బీఆర్‌ఎస్ అని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ విగ్రహ సమీపంలో జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్కడితో మొదలైన బీఆర్‌ఎస్ ప్రస్థానం, ఉధృతమై ఉప్పెనగా మారి స్వరాష్ట్ర కలను సాకారం చేసిందన్నారు. మాజీ సీఎం పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ నాయకత్వంలో పోరాడి సాధించుకున్న తెలంగాణను పదేళ్లలో దేశానికి ఆదర్శంగా నిలిపిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కిందన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని కార్యకర్తల సభ్యత్వం తమ పార్టీకే ఉందన్నారు. కార్యకర్తకు రూ. 2 లక్షల ఉచిత ప్రమాద బీమా అందించడంతో పాటు, కష్టసుఖాల్లో అండగా ఉంటున్నామని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, అన్నివర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. నేడు మరోసారి ప్రజల పక్షాన ప్రజా ఉద్యమం చేసేందుకు బీఆర్‌ఎస్ పార్టీ సంసిద్ధమైందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

జిన్నారం(పటాన్‌చెరు): హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆరోపించారు. శనివారం జిన్నారం మండలం గడ్డపోతారంలో జిన్నారం, గుమ్మడిదల మండలాల బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపు కోసం అమలు చేయాల్సి వ్యూహాలపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన చర్చించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అమలు కాని హామీలను ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. వెంకట్రామిరెడ్డిని గెలిపించుకునేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, జిన్నారం, గుమ్మడిదల మండలాల పార్టీ అధ్యక్షుడు రాజేశ్, హుస్సేన్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి


సమీక్షిస్తున్న ఎంపీడీఓ హరినందన్‌రావు

మునిపల్లి(అందోల్): తాగునీటి సౌకర్యం కల్పించాలని మండలంలోని పెద్దలోడి, అంతారం గ్రామాల ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం మండలంలోని అంతారంలో వాటర్ ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. సరఫరా చేస్తున్న నీరు సరిపోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు సరిపడా తాగునీరు సరఫరా చేయాలని పెద్దలోడి గ్రామస్తుడు శివకుమార్ సంబంధిత అధికారులను కోరారు.

మునిపల్లి(అందోల్): ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని ఎంపీడీఓ హరినందన్‌రావు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం మండలంలోని ఎంపీపీ సర్వసభ్య సమావేశంలో తాగునీటి సరఫరాపై కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తాగునీటి కోసం ఆయా గ్రామాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని సత్వరమే పరిష్కరించాలన్నారు. తాగునీటి సరఫరాపై కావాలనే కొందరు తమపై ఫిర్యాదు చేస్తున్నారని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ దృష్టికి తెచ్చారు. సమావేశంలో ఎంపీఓ నాగలక్ష్మి, ఆర్‌డబ్ల్యూ ఏఈ అంగద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపిద్దాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : రానున్న లోకసభ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిను భారీ మెజార్టీతో గెలిపిద్దామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, రాష్ట్ర శాసనమండలి మాజీ ప్రోటెమ్ చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి పట్టణంలో భారతీనగర్, రామచంద్రాపురం డివిజన్‌ల ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు పుష్పనగేష్, సింధు ఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఆంజయ్య పాల్గొన్నారు.

బీజేపీ హ్యాట్రిక్ విజయం ఖాయం

పుల్‌కల్(అందోల్) : జహీరాబాద్ లోకసభ నియోజకవర్గం పరిధిలో బీజేపీకి జనాదరణ పెరుగుతుందని ఆపార్టీ అభ్యర్థి బీబీపాటిల్ తెలిపారు. శనివారం పుల్‌కల్‌లో రోడ్ షో నిర్వహించిన అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం, జహీరాబాద్ ఎంపీగా నేను హ్యాట్రిక్ విజయం సాధిస్తామని తెలిపారు.

పోలింగ్‌బూత్ పరిశీలన

జహీరాబాద్ టౌన్: కేంద్ర ఎన్నికల పరిశీలకులు గోపాల్ తివారి శనివారం జహీరాబాద్ పర్యటించారు. పట్టణంలోని ఆదర్శవిద్యాలయం పోలింగ్ బూత్ పరిశీలించారు. అక్కడి నుంచి ఏవీఎంలు నిలువ ఉంచిన జూనియర్ కళాశాలను సందర్శించారు. అనంతరం సరిహద్దులో గల చెక్‌పోస్టులను తనఖీలు చేశారు. డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి తదితర అధికారులు ఉన్నారు.

క్యాంపు కార్యాలయాన్ని స్వాధీనం చేసుకోండి

ఏఆర్‌ఓకు కాంగ్రెస్ వినతి


అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పటాన్‌చెరు టౌన్: ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ క్యాంపు కార్యాలయాన్ని వాడుతున్నాడని, ఎన్నికలయ్యే వరకు స్వాధీనం చేసుకోవాలని అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు నర్సింహారెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో రోజూ నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రచారం జరుగుతుందన్నారు. వెంటనే స్వాధీనం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి సామయ్య, పట్టణ కార్యదర్శి అబ్దుల్లా పాషా, ఏఐటీయూసీ కార్యదర్శి ప్రసాద్, నాయకులు రమేష్ పటేల్, రవి ముదిరాజ్, సాయిలు పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం


జహీరాబాద్‌లో పార్టీ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: పట్టణంలో బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్యకర్తలంతా లోక్‌సభ ఎన్నికల కోసం పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ఇన్‌చార్జి దేవిప్రసాద్, తట్టు నారాయణ, నామరవికిరణ్ గుప్తా, యాకూబ్, గుండప్ప, మోహియోద్దీన్, ముర్తుజా, ముత్యాల చందు, తంజీమ్, బండి మోహన్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


వ్యక్తి మృతదేహం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన శనివారం మండల పరిధిలోని ఆరూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. సీఐ మహేష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 50ఏళ్ల వయసు ఉన్న వ్యక్తి మృతదేహం ఆరూర్ గ్రామ శివారులోని జాతీయ రహదారి రోడ్డు పక్కన పడిఉన్న గుర్తించారు. వడదెబ్బ, అనారోగ్యం కారణంగా మృతి చెంది ఉండొచ్చు పోలీసులు భావిస్తున్నారు. ఆరూర్ గ్రామ నివాసి నాయికోటి మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని సదాశివపేట ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే 8712656721నంబర్లలో సంప్రదించాలని సీఐ సూచించారు.